క్లుప్తంగా...

అబిడ్స్ సబ్ డివిజన్ ఏసీపీగా చంద్రశేఖర్



అబిడ్స్: సెంట్రల్ జోన్‌లోని అబిడ్స్ సబ్ డివిజన్ ఏసీపీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా ఆకుల చంద్రశేఖర్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన పూర్ణచంద్రరావు సచివాలయం సబ్ డివిజన్‌కు బదిలీ కావడంతో కూకట్‌పల్లి ఏసీపీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం చంద్రశేఖర్ అబిడ్స్ నూతన ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించి సబ్ డివిజన్ పరిధిలోని అబిడ్స్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల ప్రాంతాలను సందర్శించి ప్రత్యేకతలను తెలుసుకున్నారు. సీఐలు ప్రసాదరావు, శంకర్, ఎస్ఐలు, సిబ్బంది నూతన ఏసీపీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పనివృత్తి వార్ల సేవలు అభినందనీయం



జీతభత్యాలు అందిస్తున్న చైర్మన్ క్రిష్టయాదవ్

లంగర్‌హౌస్: బోనాల ఉత్సవాల్లో మన ఆచారాలు భావితరాలకు తెలిసేలా చేస్తున్న పనివృత్తివార్ల సేవలు అభినందనీయమని లంగర్‌హౌస్ మహంకాళి ఆలయ చైర్మన్ ఆర్లెళ్ల క్రిష్టాయాదవ్ అన్నారు. లంగర్‌హౌస్ బోనాల సందర్భంగా సేవలందించిన పని వృత్తివార్లకు బుధవారం ఆలయంలో ఒడిబియ్యం, జీతభత్యాలు అందించారు. ఈ సందర్భంగా సేవలు అందించిన వారిని సన్మానించారు. అనంతరం క్రిష్టాయాదవ్ మాట్లాడుతు.... పని వృత్తి వార్ల వల్లనే అమ్మవారికి సమయానికి సాంప్రదాయ పూజలు, సేవలందుతున్నాయన్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శి రవికాంత్, కోశాధికారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, శివశంకర్, బైండ్ల భార్గవ్ తదితరులు ఉన్నారు.

బీబీకా ఆలంను దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు



చార్మినార్: మొహర్రం పండుగ ఏడవ సంతాప దినాలను పురస్కరించుకొని బుధవారం డబీర్‌పురాలోని చారిత్రాత్మకమైన బీబీకా ఆలంను టీపీసీసీ మైనార్టీ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేష్, బహదూర్‌పురా ఇన్‌చార్జి ఖలీమ్ బాబా, పార్టీ సీనియర్ నాయయకులు మహ్మద్ మూసా ఖాసిం, హైదర్ అలీ జాఫ్రీ, యూసుఫ్ దానిష్ తదితరులు కలిసి ప్రత్యేకంగా బీబీకా అలావాను సందర్శించి అక్కడ కొలువైన ఆలంకు దట్టీలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఏటా మొహర్రం పండుగ సందర్భంగా బీబీకా ఆలం వద్ద పాతనగరంలో సంతాప దినాలను భారీ ఎత్తున నిర్వహించి సంతాపం వ్యక్తం చేయడమే కాకుండా సామూహికంగా మాతం నిర్వహించడం ఇక్కడి పాత నగర ముస్లింల ప్రత్యేక అని వారు అన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందిస్తాం

గన్‌ఫౌండ్రీ: ప్రజలకు ఉచిత విద్య, వైద్యం ఇవ్వడమే తమ లక్ష్యమని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ తెలిపారు. బుధవారం తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వినయ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ..ఆగస్టు మొదటి వారం నుంచి ప్రజా క్షేత్రంలోకి వెళ్లి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా త్వరలో రాష్ట్ర, జిల్లా కమిటీలు వేయనున్నట్లు తెలియజేశారు.

ముగ్గురికి ఐదు రోజుల జైలు

డబీర్‌పురా: అనుమానాస్పదంగా తిరుగుతున్న కేసులో ముగ్గురికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధి న్యూ మలక్‌పేట ప్రాంతంలో సయ్యద్ హైదర్, మహ్మద్ తౌఫిక్, నజీబ్ ఉర్ రెహమాన్‌లు ఈ నెల 25వ తేదీన తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న డబీర్‌పురా పీఎస్ కానిస్టేబుల్ మోహన్ రావును ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో వారిని అదుపులోకి తీసుకొని వారిపై ఈ-పెట్టి కేసులు నమోదు చేశారు. అనంతరం సయ్యద్ హైదర్, మహ్మద్ తౌఫిక్, నజీబ్ ఉర్ రెహమాన్‌లను పోలీసులు బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా... మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు ముగ్గురికి 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రి పనితీరు భేష్



గోల్కొండ ఆస్పత్రిలో సమీక్ష సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత

గోల్కొండ: గోల్కొండ ఏరియా పనితీరు గతంలో కంటే ఎంతో మెరుగైందని డీసీహెచ్ఎస్ హైదరాబాద్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. బుధవారం ఆమె గోల్కొండ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా ఆస్పత్రి ఓపి, రిజిస్ట్రేషన్ తదితర విభాగాలను సందర్శించారు. అనంతరం ఆమె ఇన్‌పెషంట్ల వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇన్‌పేషెంట్లతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నుంచి అందుతున్న డైట్‌ను కూడా ఆమె ఇన్‌పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆస్పత్రిలో ఉన్న ఐసియూ, డయాలసిస్ విభాగాన్ని కూడా సందర్శించారు. అనంతరం ఆమె ఆస్పత్రి వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సంవత్సర కాలంగా ఆస్పత్రిలో ఓపి సంఖ్యతో పాటు ప్రసవాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజర్ ఉల్లా ఆమెకు తెలిపారు. వైద్య సిబ్బంది సహకారంతోనే ఏరియా ఆస్పత్రికి ప్రజల్లో ఆదరణ పెరిగిందని ఆయన అన్నారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా రవూఫ్ ఉద్దీన్, ఏఓ శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ తస్లీమ్ మెహర్, కవిత తదితరులున్నారు.

చిందు యక్షగాన కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి శ్రీనివాస్ గౌడ్



కళాకారుడు గడ్డం తమ్మయ్యను సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: చిందు యక్షగాన వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం చిందు యక్షగాన కళాకారుల బృందం ప్రతినిధులు మంత్రిని కలిసి కళాకారుల స్థితిగతులను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కళాకరుల సంఘం అధ్యక్షుడు పిల్లిట్ల ముకుందం మాట్లాడుతూ... ప్రస్తు ఆధునిక సమాజంలో సనాతన సంప్రదాయ వారసత్వాన్ని కాపాడుతూ... భాషా సాంస్కృతిక ద్వారా కళను ప్రదర్శిస్తే రూ. 10 వేలు మాత్రమే ఇస్తున్నారని ఈ పారితోషికాన్ని రూ. 30 వేలకు పెంచాలన్నారు. నిరుపేద యక్షగాన కళాకారులు చనిపోతే రూ. 50 వేలు ఇచ్చేవారని, కరోనా తర్వాత ఆ ఆర్థిక సాయం అందడం లేదని గుర్తుచేశారు. కళాకారులు మరణిస్తే రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. తమ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. అనంతరం సంస్థ అవార్డు గ్రహీత గడ్డం తమ్మయ్యను ఘనంగా సన్మానించారు. కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం హిమగిరి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షులు సుదర్శనం, కోశాధికారి సురేందర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత



శ్రీమద్భాగవత్ కథలో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఫీల్‌ఖానాలో జరిగిన శ్రీమద్భాగవత్ కథలో ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీరామ్ ప్రభుజీని ఆయన ఘనంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను పొందాలని సూచించారు. మనశాంతి కలిగేందుకు, మనిషి సంతోషంగా ఉండేందుకు ఆధ్యాత్మికతలు ఎంతో దోహద పడుతాయన్నారు.

12న చలో హైదరాబాద్

సుల్తాన్‌బజార్: సీపీఎస్ రద్దు కోసం ఆగస్టు 12న హైదరాబాద్‌లో నిర్వహించే పాత పెన్షన్ సాధన సభను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎన్.నరేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం అబిడ్స్‌లోని భీమాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... అభి నహీతో కబి నహి అనే నినాదంతో పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ నాయకత్వంలో జులై 16 నుంచి జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ యాత్ర ప్రారంభమై 33 జిల్లాల గుండా 16 రోజుల పాటు కొనసాగుతూ.. ఈ నెల 30వ తేదీన అగ్రికల్చర్ యూనివర్శిటీలో హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. 31వ తేది యాదగిరి గుట్టలో ఈ సంకల్ప యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ యాత్రకు అన్ని సంఘాల నాయకత్వం మద్దతు ఇచ్చారన్నారు. ఈ నెల ఆగస్టు 12న జరగబోయే రాష్ట్ర సభకు ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై ఉద్యోగుల శక్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోటలో భక్తులను అనుమతించని అధికారులు



కోట మెయిన్ గేటు పక్కనే అమ్మవారి చిత్రపటానికి పూజలు చేస్తున్న ప్రజలు

గోల్కొండ: గోల్కొండ కోటలో అమ్మవారి భక్తులకు ప్రవేశం లేదని కేంద్ర పురాతత్వశాఖ అధికారులు అమ్మవారికి పూజలు చేసుకునేందుకు వస్తున్న భక్తులను కోటలోకి అనుమతించడం లేదు. గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి దర్శనానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి పలు కుటుంబాలు వచ్చాయి. పూజా సామగ్రితో పాటు అమ్మవారికి నైవేద్యం తయారు చేసుకోవడానికి అవసరమైన సామాగ్రితో వారు గేటు వద్దకు వచ్చారు. అయితే కోటలో కేవలం అమ్మవారి దర్శనానికి అనుమతి ఉందని, నైవేద్యం తయారు చేసుకోవడానికి వెంట సామగ్రి తెచ్చుకోవడానికి అనుమతి లేదంటూ కోట అధికారులను తిరిగి పంపించారు. దీంతో పలువురు భక్తులు అధికారుల వైఖరిపై మండిపడ్డారు. కొందరు మాత్రం రాందేవ్‌గూడ రోడ్డులోని ఆషుర్‌ఖానా వద్ద ప్రదేశంలో వంటలు చేసుకుని అమ్మవారి వద్దకు బయలుదేరారు. మరి కొందరు కోట మెయిన్ గేటు పక్కనే ఫుట్‌పాత్ పై అమ్మవారి ఫొటో పెట్టి కొబ్బరికాయ కొట్టి పూజలు చేసుకున్నారు.

ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా తగిన చర్యలు

చార్మినార్: వర్షాలు దంచి కొడుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నగర ట్రాఫిక్ డీసీపీ-3 డి.శ్రీనివాస్, సౌత్ ఈస్ట్ జోన్ చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ కందుల సత్యనారాయణ తదితరుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరానికి తాగునీరు అందిస్తున్న జంట జలశయాల గేట్లను ఎత్తి వరదనీటిని మూసి నదిలోకి వదులుతున్న నేపథ్యంలో మూసి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలందరిని అవసరమైన మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని డీసీపీ శ్రీనివాస్ తమకు సూచించారని కందుల సత్యనారాయణ తెలిపారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు ట్రాఫిక్‌ను దారి మళ్లించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. వీరి వెంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

శాతం చెరువు తూముకు మరమ్మతులు



శాతంచెరువు తూము పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నదీమ్ కాలనీకి శాశ్వతంగా వరద ముంపు తప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన శాతం చెరువు తూము మరమ్మత్తులు పనులు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలకు గంట గంటకు పెరుగుతూ వస్తున్నదని, దీనివల్ల నదీమ్ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయం గమనించిన తాను మంగళవారం సాయంత్రం బల్దియా కమిషనర్ తోపాటు బల్దియా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి శాతం చెరువు తూము మరమ్మత్తులు చేయాలని ప్రతిపాదించడం జరిగిందన్నారు. దీని పై స్పందించిన అధికారులు బుధవారం ఉదయమే తూము మరమ్మత్తులు పనులు చేపట్టామన్నారు. పాత తూము హైడర్లతో కట్టి ఉందని, పూడికలు తీయడంతో పాటు తూము గోడలు తూము నీటికి కూలిపోవడం వల్లన శాతం చెరువు నుండి బయటకు వెళ్ళే నీరు తగ్గిందన్నారు. కాగా పాత తూమును పూర్తిగా తవ్వేసి కొత్త పైప్‌లైన్‌లు వేయాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. రేపు ఉదయం లోగా ఈ పనులు పూర్తవుతాయని ఆయన అన్నారు. ఆయన వెంట బల్దియా ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్ ప్రసాద్, కార్పొరేటర్లు హారూన్ ఫరాన్, మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతూ బీజేపీ నేత మృతి



దుంపల నరేందర్

డబీర్‌పురా: గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డబీర్‌పురా డీసీ పటేల్ కాలనీ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు దుంపల నరేందర్ మంగళవారం మృతి చెందాడు. నరేందర్ బీజేపీ 1985లో కార్యకర్తగా చేరి ఇప్పటి వరకు పలు పదవుల్లో పని చేశారు. బీఎంఎస్ యూనియన్ ఉపాధ్యక్షునిగా, విశ్వ హిందూ పరిషత్తు ఓల్డ్‌సిటీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. నరేందర్ మృతి వార్త తెలుసుకున్న పలువురు నాయకులు, డీసీ పటేల్ కాలనీ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లంగర్‌హౌస్: రోడ్డు దాటుతున్న మహిళను డీసీఎం ఢీకొట్టడంతో చికిత్స పొందుతు మృతిచెందింది. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన మేరకు.. లంగర్‌హౌస్ పెన్షన్‌పురలో నివాసముండే జాలుకా బేగం(61) మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మెహిదీపట్నం నుండి లంగర్‌హౌస్‌కు ఆటోలో వచ్చింది. పి.ఇంద్రారెడ్డి ఫ్లైఓవర్ వద్ద దిగిన ఆమెను రోడ్డు దాటుతుండగా డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయమవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఆమె మంగళవారం అర్ధరాత్రి దాటాక ఆమె మృతిచెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

జీహెచ్ఎంసీ కార్మికురాలు గుండెపోటుతో మృతి



అలివేలు (ఫైల్)

జియాగూడ: జియాగూడ గంగానగర్‌లో నివాసం ఉంటున్న ఏడుమేకల అలివేలు జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలిగా కార్వాన్ నానల్‌నగర్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తోంది. కాగా బుధవారం తెల్లవారుజామున ఈమెకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు బర్కత్‌పురా సీసీ షరఫ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దివంగత ఏడుమేకల అలివేలు జీహెచ్ఎంసీ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తూ కరోనా సమయంలో తెలంగాణ కరోనా వ్యాప్తి చెందకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రముఖులు విరాళాలు ఇస్తున్న సమయంలో తనవంతు సహాయంగా ఒక నెల జీతాన్ని ముఖ్యమంత్రి సహా నిధికి విరాళంగా ఇచ్చింది. ఆమె కరోనా సమయంలో మొట్టమొదటిగా విరాళంగా ఇచ్చిన మహిళ. ఈమె మృతితో గంగానగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వృద్ధుడి అదృశ్యం



రణ్‌బీర్ సింగ్ (ఫైల్)

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన బుధవారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన మేరకు.. మొఘల్‌పురా సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన రణ్‌బీర్ సింగ్ (62) ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో రణ్‌బీర్ సింగ్ సోదరుడు తారాచంద్ మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 040-27854783 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

రోడ్లను అభివృద్ధి పరుస్తాం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లను ఆధునీకరిస్తామని మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కిస్మత్‌పూర్ నుంచి ఎర్రకుంట వెళ్లే రహదారిని అధికారులు, సిబ్బంది, నాయకులతో కలిసి ఆ యన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మ రమ్మత్తులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, డిఈ యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీబీకా ఆలంను దర్శించుకున్న హోంమంత్రి



బీబీకా ఆలంలను దర్శించుకుంటున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ

డబీర్‌పురా: డబీర్‌పురాలోని బీబీకా అలావాను బుధవారం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించారు. ఈ సందర్భంగా అలావా నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ... మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని ఈ నెల 29వ తేదీన పాతబస్తీ వీధుల్లో నిర్వహించిన ఆలంల సామూహిక ఊరేగింపుకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు. మొహర్రం సంతాప దినాల సందర్భంగా అన్ని ఆషూర్‌ఖానా వద్ద ఏర్పాట్లకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి మీర్ ఇనాయత్ అలీ బాక్రీ తదితరులు ఉన్నారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు



కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఆగస్టు 3వ తేదీన దాదా పు 4 వేల మంది ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహిస్తామని ఆయన అన్నారు. బుధవారం ఉద్యోగుల సమావేశానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... కాంట్రిబ్యూటరీ పెన్షన్ నిర్మూలన, పాత పెన్షన్ విధానం అమలు పరిచేందుకు తమ సంఘం విశేష కృషి చేస్తుందన్నారు. పాత పెన్షన్ విధానంతో ఉద్యోగులకందరికి ఎంతో లాభం చేకూరుతుందని ఆయన అన్నారు. వేలాదిమంది ఉద్యోగులతో కలిసి పాత పెన్షన్ విధానం అమలు పై చర్చించిన అనంతరం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సహా అధ్యక్షులు కేఆర్.రాజ్ కుమార్, విక్రమ్‌కుమార్, బాల్‌రాజ్, కుద్రాడి శ్రీనివాస్, శంకర్, శ్రీధర్ నాయుడు, ముఖీమ్ ఖురేషి పాల్గొన్నారు.

మొహర్రం సంతాప దినాలకు బందోబస్తు కొనసాగించాలి



దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యకు వినతి పత్రం అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని అన్ని ఆషూర్‌ఖానాల వద్ద తగిన బందోబస్తుతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు వినతిపత్రాలు రాశారని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ఈ మేరకు పాతబస్తీలోని అన్ని ఆషూర్‌ఖానాల వద్ద బందోబస్తును కొనసాగించాలని కోరుతూ రాసిన లెటర్‌ను బుధవారం తాను దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యకు అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన మొహర్రం సంతాప దినాలు 68 రోజుల పాటు కొనసాగుతాయని.. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన పాతబస్తీ చార్మినార్ ప్రధాన వీధుల్లో బీబీకా ఆలం సామూహిక ఊరేగింపు కొనసాగుతుందని.. ఇందుకోసం అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీని కోరినట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ లలితాబాగ్‌లోని సద్గురు శ్రీ మలయాళ స్వామి సేవా సమాజం భవనంలో జరుగుతున్న శ్రీమద్ భాగవత సప్తాహ రెండో రోజు కార్యక్రమానికి ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా పాల్గొని మలయాళ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమన్‌గల్లు శ్రీరామ దూత ఆశ్రమాదిపతి శివానంద స్వామి బోధిస్తున్న భాగవత సప్తాహంలో పాల్గొన్నారు. మలయాళ స్వామి సేవా సమాజం ట్రస్టు ఉపాధ్యక్షులు సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గుప్తా ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి గందే సురేశ్, కోశాధికారి దార్ల యాదయ్య పాల్గొన్నారు.

పెచ్చులూడిన భవనాన్ని పరిశీలించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

గౌలిపురా: ఇటీవల కురిసిన వర్షాలకు శిథిలావస్థకు చేరుకున్న అలియాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య (యుపీహెచ్‌సీ) కేంద్రం భవనం పెచ్చులూడిన దుస్థితిపై 'సాక్షి'లో " శిథిలావస్థలో అలియాబాద్ యుపీహెచ్‌సీ భవనం" అనే శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం హైదరాబాద్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జె.వెంకట్, టీఎస్ఎంఎస్ఐ డీసీ అధికారులు, జగదీష్ ప్రసాద్‌లు అలియాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అలియాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హాల్‌కు తరలించాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

కిరణ్ కుమార్ రెడ్డి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరు



గౌరీ సతీష్

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి బీజేపీలో చేరి అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పడితే అంధకారం ఏర్పడుతుందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. బుధవారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకరులతో మాట్లాడుతూ.... తెలంగాణ వ్యతిరేకిగా, తెలంగాణ ద్రోహిగా పేరుగాంచిన కిరణ్‌కుమార్‌రెడ్డిని బీజేపీ అందలం ఎక్కించుకోవడాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు అంతర్గతంగా ఒక్కటైన విషయం ప్రజలకు తెలుసన్నారు. కేవలం కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు.

డబుల్ బెడ్‌రూం బీఆర్ఎస్ డ్రామా

గోల్కొండ: పేదలకు డబుల్ బెడ్‌రూం ప్రకటనలు బీఆర్ఎస్ అభద్రతపు ప్రకటనలలో భాగమని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆరోపించారు. కేవలం కొన్నిడబుల్ బెడ్‌రూంలు మాత్రమే అక్కడక్కడ కట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ఆయన అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ డ్రామాలు తెలుస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు గుణపాఠం నేర్పడం ఖాయమన్నారు.

ఘనంగా వేడుకలు



హన్స్‌రాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న దేవాలయాల కమిటీ ప్రతినిధులు

చార్మినార్: పాతనగర శివారులోని సొడమ్మ దేవాలయంలో జరిగిన మారుబోనం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న హరిబౌలిలోని బంగారు మైసమ్మ దేవాలయం కమిటీ సలహాదారులు అనంతోజు హన్స్‌రాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు పాటేల్ సదానంద్ యాదవ్, సుల్తాన్‌షాహీ జగదాంబ దేవాలయం కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ, ఉప్పుగూడ దేవాలయం కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్, బంగారు మైసమ్మ దేవాలయం కమిటీ సలహాదారులు మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేయించి హన్స్‌రాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.